రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు
8125972476

క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 సంచిక : 95 | ఆదివారం 15 డిసెంబర్ 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8




ఆ కుటుంబానికి ఆమె లోటు

## ఎవరూ పూడ్చలేనిది

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

జైలు నుంచి విడుదల అనంతరం మీడియాతో అల్లుఅర్జున్

8



నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ..

# రాజ్యాంగానికి విషబీజాలు

## దేశ ఐక్యతకు రాజ్యాంగమే ఆధారం

దానిని దెబ్బతీసేందుకు విషబీజాలు

భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తి

ఇవి యావత్ దేశం గర్వపడే క్షణాలు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది

ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14:** భారత రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. ఎందరో మహానుభావులు కలిసి మన రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మోదీ మాట్లాడారు. ప్రజాస్వామ్య పండుగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశం గర్వపడే క్షణాలని అన్నారు. "దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది. దేశ అధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలి. మన రాజ్యాంగం మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. దేశం అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలి. ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వార్థపరుల వల్ల అనేక కష్టాలు పడ్డాం. బానిస మనస్తత్వంతో ఉన్నవాళ్లు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారు" అని మోదీ అన్నారు. ఉపాధిని వెతుక్కుంటూ పేదలు పలు ప్రాంతాలకు వెళ్తారని, పేదలకు ఇబ్బంది లేకుండా 'వన్ నేషన్ - వన్ రేషన్ కార్డ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. "పేదలు ఎక్కడున్నా రేషన్ సులువుగా తీసుకోలగాలి. ఆయుష్మాన్ కార్డు ద్వారా ఉచితంగా వైద్య చికిత్స అందిస్తున్నాం. డిజిటల్ ఇండియా దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. మన రాజ్యాంగం అన్ని భాషలను గౌరవించింది. రాష్ట్రాల మాతృభాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. మాతృభాషలో చదివిన పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యపడుతుంది" అని మోదీ అన్నారు. "మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు

మిగతా 2లో..



గురుకులాలు ఇక..

## మల్టీ టాలెంటెడ్ సెంటర్స్

సంక్షేమ వసతి గృహాలను ప్రక్షాళన చేస్తాం

ప్రతి నెల 10లోపు విద్యా సంస్థలకు నిధులు

ఇటీవలే గురుకులాల డైట్ ఛార్జీలు పెంచాం

గురుకుల పాఠశాలను సందర్శించిన సీఎం

గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ప్రారంభం

**హైదరాబాద్, డిసెంబర్ 14(క్విక్ టుడే న్యూస్):** ఇటీవలే గురుకులాల డైట్ ఛార్జీలు పెంచాం. గురుకులాల బాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు గురుకులాల విద్యార్థుల కంటే ఎక్కువనే భావన ఉంది. గురుకులాలు అంటే బహుళ నైపుణ్య కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలి. గురుకులాల వ్యవస్థను పీవీ నరసింహారావు

మిగతా 2లో..

రేపు వన్‌నేషన్...

## వన్ ఎన్నికల బిల్లు

లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14:** దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ముసాయిదా బిల్లులు ఈనెల 16వ తేదీన లోక్‌సభ ముందుకు రానున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. డిసెంబర్ 16న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర

మిగతా 2లో..



## దేశానికే ఆదర్శంగా కులగణన

98 శాతం కులగణన పూర్తి

ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయ్

రైతాంగ పోరాటంలో తెగువ చూపిన దొడ్డి కొమురయ్య

కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

2

## రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలి

బీజేపీ రాజ్యాంగాన్ని రక్షిస్తాననడం విడ్డూరం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 14:** రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెబితే ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రక్షిస్తామని అనడం విడ్డూరంగా ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో రాహుల్ పాల్గొన్నారు. రాజ్యాంగంలో అసలు భారతీయతే లేదనీ, దాని స్థానంలో మనుస్మృతి ఉండాలని ఆర్?ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ చెప్పిన మాటలను రాహుల్ గుర్తు చేశారు. ఏకలవ్యుడి బొటనవేలిని ద్రోణుడు నరికించినట్లే అదానీ, అంబానీ లాభం కోసం చిన్న వ్యాపారుల వేలిని బీజేపీ కత్తిరించిందని రాహుల్

మిగతా 2లో..



## చలో ఢిల్లీ ఉద్రిక్తం

రైతులపై బాష్పవాయువ ప్రయోగించిన పోలీసులు

డిమాండ్ల సాధన కోసం అన్నదాతల ఉద్యమబాట

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14:** తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇవాళ మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు

మిగతా 2లో..

## అద్వానీకి అస్వస్థత

ఐసీయూలో చికిత్స పొందుతున్న బీజేపీ అగ్రనేత



**న్యూఢిల్లీ, డిసెంబర్ 14:** బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్ వినిత్ సూరి సంరక్షణలో

మిగతా 2లో..

మార్చి కల్లా గ్రూప్-1, 3

## పరీక్షల ఫలితాలు

నేటి నుంచి గ్రూపు-2 పరీక్షలు

టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు



**హైదరాబాద్, డిసెంబర్ 14(క్విక్ టుడే న్యూస్):** వచ్చే ఏడాది మార్చి నాటికి గ్రూప్-1, 3 పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇక ఆదివారం, సోమవారం నిర్వహించబోయే గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ కేవలం సిలబస్ మాత్రమే

మిగతా 2లో..

మార్చి 3 నుంచే

## ఇంటర్ పరీక్షలు!

తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు!

పరీక్షల తేదీలపై కసరత్తు చేస్తున్న అధికారులు

అధికారికంగా ప్రకటన వెలువడడమే తరువాయి

**హైదరాబాద్, డిసెంబర్ 14(క్విక్ టుడే న్యూస్):** ఇంటర్ పరీక్షల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని, షెడ్యూల్ ఖరారు చేసే అంశం తుది దశలో ఉందని అధికార వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ దాదాపుగా ఖరారైందని వివరించాయి. వచ్చే వారంలో అధికారికంగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అనధికారిక సమాచారం ప్రకారం.. మార్చిలో

మిగతా 2లో..

త్వరలో 6వేల పోస్టులతో

## మరో మెగా డీఎస్సీ

నిరుద్యోగులకు డిప్యూటీ సీఎం తీపి కబురు



**హైదరాబాద్, డిసెంబర్ 14(క్విక్ టుడే న్యూస్):** నిరుద్యోగులకు తెలంగాణ డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీపి కబురు చెప్పారు. త్వరలోనే 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ వేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈరోజు రాష్ట్రవ్యాప్త ఒకరోజు హాస్టల్ తనిఖీ

మిగతా 2లో..



జగన్ ఆస్తుల కేసులో

## కీలక పరిణామం

సుప్రీంకోర్టుకు సీబీఐ, ఈడీ నివేదిక

అక్రమాస్తుల కేసు బదిలీ, బెయిల్ రద్దుపై విచారణ

జనవరి 10కి తదుపరి విచారణ వాయిదా

3

RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
QUICK TODAY
ఆదివారం 15 డిసెంబర్ 2024
quicktodaynews.com




## రాజ్యాంగానికి
# విషబీజాలు

కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. భిన్నత్వంలో ఏకత్వ భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదు. రాజ్యాంగ శక్తి, ప్రజల ఆశీర్వాదం మాకున్నాయి. మా పరిపాలన చూసి ప్రజలు మూడు సార్లు మాకు అధికారం ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు అండగా నిలిచారు. ఈ దేశాన్ని ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు పాలించింది. ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించింది. 1947 నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు. ఆ సమయంలో ఆ కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖలు రాశారు. ఆయన తప్పు చేస్తున్నారని అప్పటి స్పీకర్ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ఎంతోమంది పెద్దలు సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అనేకసార్లు ప్రయత్నించారు" అని మోదీ వ్యాఖ్యానించారు. "ఆనాటి కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75 సార్లు సవరణలు చేశారు. ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులు హరించారు. వేలాది మందిని జైళ్లకు తరలించారు. కోర్టుల నోరు, పత్రికల గొంతు నొక్కేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు పన్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారు. కీలక నిర్ణయాలు తీసుకునేది పార్టీ అధ్యక్షురాలు అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారు. ఇదే కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనం" అని మోదీ విమర్శలు గుప్పించారు. లోక్‌సభలో రాజ్యాంగంపై రెండో రోజులుగా చర్చ జరుగుతోంది. అధికార, విపక్ష ఎంపీలు రాజ్యాంగంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజ్యాంగంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తున్నారు. నిన్న రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. దీనిపై విపక్షాల నుంచి ప్రియాంక గాంధీ స్పందించారు. రెండో రోజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. రెండో రోజు కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమయంలో అదానీ, అగ్నివీర్, పార్శ్వ ప్రవేశానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాడు. ఈ నేపథ్యంలోనే విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు వచ్చారు. ప్రధాని మోదీ లోక్‌సభకు చేరుకోగానే బీజేపీ ఎంపీలు జై శ్రీరామ్ నినాదాలు చేయడం ప్రారంభించారు. 75 ఏళ్ల రాజ్యాంగ యాత్ర గొప్ప ప్రయాణం అని ప్రధాని మోదీ అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతల దీర్ఘకాలిక దృక్పథం, సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇది సంబరాలు జరుపుకోవాల్సిన క్షణం అని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న వారందరికీ ప్రధాని మోదీ అభినందనలు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ స్పందిస్తూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ఆ సమయంలో భారతదేశానికి వ్యక్తీకరించిన అన్ని అవకాశాలను అధిగమిస్తూ భారత రాజ్యాంగం ఇక్కడికి తీసుకువచ్చిందని అన్నారు. ఈ గొప్ప విజయానికి రాజ్యాంగ నిర్మాతలతో పాటు దేశంలోని లక్షలాది మంది పౌరులకు గౌరవపూర్వకంగా నమస్కరిస్తున్నానన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయంలో చాలా స్పృహతో ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. 1950 నుంచి భారతదేశంలో ప్రజాస్వామ్యం వస్తోందని నమ్మలేదు. భారతదేశ ప్రజాస్వామ్యం, భారతదేశ గణతంత్ర గతం చాలా గొప్పది. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు ప్రధాని మోదీ. అందుకే భారతదేశాన్ని నేడు ప్రజాస్వామ్య మాతగా పిలుస్తున్నారు. మనది భారీ ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రాజ్యాంగంలో మహిళా శక్తి కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోదీ అన్నారు. చాలా దేశాలు మహిళలకు ఓటు హక్కును చాలా ఆలస్యంగా ఇచ్చాయని, అయితే భారతదేశంలో రాజ్యాంగం మొదటి నుండి మహిళలకు ఈ హక్కును కల్పించిందని ఆయన గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు . అందుకే భారతదేశాన్ని ప్రజాస్వామ్య మాతగా పిలుస్తారు. మనది పెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. మనం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## మార్చి 3 నుంచే
# ఇంటర్ పరీక్షలు!

పరీక్షలు నిర్వహించాలని, ఆ నెలాఖరులోగా అన్ని పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అనుగుణంగా మార్చి 3వ తేదీ నుంచే ఇంటర్ పరీక్షలు ప్రారంభిచనున్నట్లు సమాచారం. ఇంటర్ అన్ని గ్రూపులకు చెందిన పరీక్షలు నిర్వహించేందుకు దాదాపు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. నెలాఖరులోగా పరీక్షలు పూర్తిచేయాలంటే మార్చి 3న పరీక్షలు ప్రారంభించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఇక, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఫిబ్రవరిలో పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షల ఫీజు గడువు డిసెంబర్ 3 తో ముగియగా ఆలస్య రుసుముతో జనవరి 2 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డ్ కల్పించింది. రూ.2 వేల ఆలస్య రుసుముతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 9 నుంచి 10 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతారని ఇంటర్ బోర్డ్ అధికారులు తెలిపారు. దీనికి తగ్గట్లు రాష్ట్రంలో పరీక్షలకు ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

## రాజ్యాంగం స్థానంలో
# మనుస్మృతి ఉండాలి

వ్యాఖ్యానించారు. అగ్నివీర్, ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. మద్దతుధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనావేలిని కత్తిరించారని దుయ్యబట్టారు. సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ సమానత్వం ఉండదని అంబేద్కర్ చెప్పారన్న రాహుల్, కులగణనతో సమానత్వం వైపు అడుగులేస్తామని తెలిపారు. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారిత వివక్షను నిషేధించాలని రాజ్యాంగం చెబితే బీజేపీ మాత్రం విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని తెలిపారు. మనుస్మృతి వంటి ప్రాచీన విధానాలతోనే దేశం నడవాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగం గురించి, భారతదేశాన్ని ఎలా నడపాలని ఆర్ఎస్ఎస్ సుప్రీం లీడర్ సావర్కర్ భావించారో చెబుతూ నా ప్రసంగాన్ని ప్రారంభించాలనుకుంటున్నాను. "రాజ్యాంగంలో చెత్త విషయం ఏమిటంటే, దానిలో భారతీయత ఏమీ లేదు. మనుస్మృతి అనేది మన హిందూ దేశానికి వేదాల తర్వాత అత్యంత పూజనీయమైనది. మన ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు ఆధారమైంది." ఇవి సావర్కర్ చెప్పిన మాటలు. సావర్కర్ తన రచనల్లో మన రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగాన్ని మనుస్మృతితో భర్తీ చేయాలని ఆయన చెప్పారు. దానికి వ్యతిరేకంగానే మేం పోరాటం చేస్తున్నామన్నారు. మరోవైపు, భారత్‌లో అందరికీ సమాన ఓటు హక్కు ఉన్నప్పటికీ ఇక్కడ మైనారిటీలకు ఎలాంటి హక్కులు ఉండడం లేదని దుష్ప్రచారం చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్

# దేశానికే ఆదర్శంగా కులగణన

**98 శాతం కులగణన పూర్తి**
**ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయ్**
**రైతాంగ పోరాటంలో తెగువ చూపిన దొడ్డి కొమురయ్య**
**కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి**
**ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది**
**అందరికీ న్యాయం చేసే బాధ్యత నాదే**
**గ్లోబల్ మాదిగ డే కార్యక్రమంలో సీఎం**



**హైదరాబాద్, డిసెంబర్ 14(క్విక్ టుడే న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నామని అన్నారు.. ఆ విగ్రహం మన అమ్మకు, అక్కకు ప్రతిరూపమని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా కులగణన చేపడుతున్నామని వివరించారు. 98 శాతం కులగణన జరిగిందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమల నిజాయితీని, గొప్పతనాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కురుమలు అత్యంత నమ్మకస్తులని తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, ఊళ్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని చెబుతుంటానని తెలిపారు. పార్లమెంటులో కూడ కురుమ సోదరుల ప్రాతినిధ్యం పెంచుతామని చెప్పారు."కురుములకు భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చి ఇస్తారు.. వారు ఇచ్చిన డబ్బును లెక్కపెట్టుకోవాల్సిన అవసరం లేదు. దొడ్డి కొమురయ్య ఆనాడు రైతాంగ పోరాటంలో తెగువ చూపారు. దొడ్డి కొమురయ్య రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపారు. కురుమలు తెలంగాణ పునర్?నిర్మాణంలో భాగస్వాములు కావాలనేది ప్రభుత్వ కోరిక. ఈ కురుమ భవనం విద్యకు వేదిక కావాలని అన్నారు. కురుమలకు, యాదవులకు రెండేసి చొప్పున ఎంపీ సీట్లు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి గుర్తు చేశారు. కురుమలను గెలిపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. గెలవకపోతే టికెట్లు ఎందుకు ఇచ్చారని ప్రశ్నలు వస్తాయని చెప్పారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కురుమ వర్గానికి చెందిన వ్యక్తినేనని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయనని, రిజర్వేషన్ల విషయంలో అందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని తెలిపారు. హైదరాబాద్ లోని హోటల్ దసపల్లాలో గ్లోబల్ మాదిగ డే %-% 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం ఓ వర్గం చేస్తున్న పోరాటానికి మద్ధతుగా.. ఇటీవల సుప్రీం కోర్టు నుంచి సానుకూల తీర్పు వెలువడింది. దానిని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులోని మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించినట్లు వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ మాదిగ కుల ఉపకులాల రిజర్వేషన్లపై స్పష్టమైన విధానాన్ని తెలియజేసిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎన్నికల సమయంలోనే తమ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు దానంతట అదే రాలేదని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు అనుకూలంగా తీర్పు రావటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ గారి నేతృత్వంలో ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించి వాదనను వినిపించినట్లు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు విలువరించటంతో ఇక రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదిక ప్రకటించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ సమస్యలానే ఎస్సీ వర్గీకరణ సమస్యను జఠిలంగా మారిపోయిందన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తరాలుగా మాదికలు ఆకాంక్షిస్తున్నట్లుగా రిజర్వేషన్ల వర్గీకరణ అంశంలో న్యాయం ఉందని.. వారికి న్యాయం చేయాలని ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యచరణ మొదలుపెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా వర్గీకరణను అమలు చేసేందుకు చేపట్టాల్సిన విధివిధానాలు పై అధ్యయనం చేసేందుకు అధ్యయనం చేస్తున్నామని, అందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించినట్లు తెలియజేశారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యుడిషియల్ కమిషన్ సైతం నియమించినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, దాని ఆధారంగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయన్నారు.

## రేపు వన్‌నేషన్...
# వన్ ఎన్నికల బిల్లు

న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

## మార్చి కల్లా గ్రూప్-1, 3
# పరీక్షల ఫలితాలు

ఇస్తుందని, ఏ బుక్ చదవాలన్నది అభ్యర్థుల ఇష్టమని ఆయన చెప్పారు. గ్రూప్-2 ఇప్పటి వరకు నాలుగు సార్లు వాయిదా పడింది. హైకోర్టు, సుప్రీంకోర్టులో గ్రూప్-2 ఎగ్జామ్‌కు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. 5 లక్షల 51 వేల మంది గ్రూప్-2 కోసం దరఖాస్తు చేసుకున్నారు. 75 శాతం ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారు. అభ్యర్థులు ధైర్యంగా పరీక్షలు రాయండి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాను అని బుర్రా వెంకటేశం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకం ఉంచి పరీక్షలురాయండి. ఎవరి ఓఎంఆర్ షీట్ వారికే ఉంటుంది. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ తప్పనిసరి. వేగంగా గ్రూప్-2 పరీక్షల ఫలితాలు ఇస్తాం. పది రోజులుగా అన్ని అంశాలను సమీక్షించుకున్నాం. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని టీజీపీఎస్సీ చైర్మన్ పేర్కొన్నారు.

## త్వరలో 6వేల పోస్టులతో
# మరో మెగా డీఎస్సీ

కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మధిర, బోనకల్‌లోని సంక్షేమ, గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లో కొత్త మెనూను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. 10 సంవత్సరాలుగా మెస్, 16 సంవత్సరాలుగా కాస్మోటిక్స్ ఛార్జీలలో పెరుగుదల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామన్నారు. అలాగే త్వరలో 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

# అద్వానీకి అస్వస్థత

ఆయనకు చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అద్వానీ వయసు 97 ఏళ్లు. ఆయన గత కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు నెలల్లో పలుమార్లు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. తొలుత జూన్ 26న అద్వానీ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. జులై 3న మరోసారి ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఆయన్ని ఎయిమ్స్‌కి తరలించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆగస్టు 6వ తేదీన మరోసారి ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరారు. ఇప్పుడు మరోసారి అస్వస్థతకు గురయ్యారు.



## గురుకులాలు ఇక..
# మల్టీ టాలెంటెడ్ సెంటర్స్

హయాంలో తీసుకొచ్చారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఒకప్పటి గురుకుల విద్యార్థే. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి కూడా గురుకులాల విద్యార్థే. గురుకులాల విద్యార్థులు ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను సీఎం రేవంత్? రెడ్డి సందర్శించారు. అనంతరం గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్? డైట్?ను ప్రారంభించారు. ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కొంతవరకు గురుకులాల ప్రభావం తగ్గిందని సీఎం అన్నారు. గురుకులాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కారు డైట్ ఛార్జీలు పెంచలేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక గురుకులాల డైట్? ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం చరిత్ర అని సీఎం అన్నారు. 16 ఏళ్లలో ఒక్కసారైనా కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని మండిపడ్డారు. పారు. డైట్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. విద్యార్థులపై పెడుతున్న పెట్టుబడి ఖర్చు కాదని, భవిష్యత్తులో పునర్ నిర్మాణం కోసం పెట్టే ఖర్చు అని సీఎం రేవంత్? పేర్కొన్నారు. గురుకులాల్లో మార్పులు తీసుకు వస్తున్నామని, ఇక్కడి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సీఎం తెలిపారు. "ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లలను హాస్టళ్లలో పెడుతున్నారు. మనల్ని నమ్మి తల్లిదండ్రులు పిల్లలను గురుకులాల్లో పెడుతున్నారు. విద్యార్థుల మృతిపై మనం ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సిబ్బందిపై ఉంది. గతంలో డైట్? విషయంలో బిల్లులు రాలేదని నాణ్యత తగ్గిస్తున్నామని చర్చలు వస్తున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఉచితంగా కరెంట్? ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం. ప్రతి రోజు అధికారులు డైట్? తిని, నాణ్యత చూడాలని సూచించామన్నారు. 75 ఐటీఐలను ఏటీసీలుగా అప్?గ్రేడ్? చేశామని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. ఐటీఐల్లో చేరితే కచ్చితంగా ఉద్యోగం వస్తుందని అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. స్కిల్స్ వర్సిటీ దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చిన్నారులతో సీఎం రేవంత్? రెడ్డి కాసేపు ముచ్చటించి, మధ్యాహ్న భోజనం వారితో కలిసి చేశారు.

# చలో ఢిల్లీ ఉద్రిక్తం

ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యాణా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు, జల ఫిరంగులను ప్రయోగించారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా.. ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖేరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే
QUICK TODAY
ఆదివారం 15 డిసెంబర్ 2024
quicktodaynews.com


## ప్రజలకు మతస్వేచ్ఛ ఉందని
# ఆర్టికల్ 26 చెబుతోంది

### ప్రధాని మోదీపై అసదుద్దీన్ ఆగ్రహం

### రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 చదవాలని ప్రధానికి సూచన



**హైదరాబాద్, డిసెంబర్ 14 (క్విక్ టుడే న్యూస్):** దేశ ప్రజలకు మతస్వేచ్ఛ ఉందని ఆర్టికల్ 26 చెబుతోందని, మతపరమైన, స్వచ్ఛంద సేవా కార్యకలాపాల కోసం సంస్థలను ఏర్పాటు చేసే స్వేచ్ఛను ఈ ఆర్టికల్ దేశ ప్రజలకు ఇచ్చిందని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కానీ ప్రధాని మోదీ మాత్రం వక్ఫ్ బోర్డుతో రాజ్యాంగానికి సంబంధం లేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేసేముందు ఒకసారి రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను చదువుకోవాలని సూచించారు. ఇంతకీ ప్రధానికి రాజ్యాంగ పాఠాలు చెబుతోంది ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. బలముంది కదా అని వక్ఫ్ ఆస్తులను బలప్రయోగంతో దోచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ భుజానికి ఎత్తుకున్న జాతీయవాదమనేది సాంస్కృతికపరమైది కాదని... అది మతపరమైనదన్నారు. మసీదుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి... మూకదాడుల ద్వారా దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మైనార్టీలు అధికారాన్ని కలిగి ఉండడాన్ని ఎవరూ ఇష్టపడడం లేదని వాపోయారు.

## అల్లు అర్జున్‌పై
# మాకు ఎలాంటి కక్ష లేదు

### మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా?

### చట్టం తన పని తాను చేసుకుపోతుందన్న మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 14 (క్విక్ టుడే న్యూస్):** సినీ నటుడు అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కక్ష లేదని, అయినా ఆయన కారణంగా ఓ మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా? అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులే కారణమన్నారు. తొక్కిసలాట కారణంగా ఓ పేద మహిళ చనిపోతే చర్యలు తీసుకోవద్దా? అన్నారు. అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగినప్పటికీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చట్ట ప్రకారమే అల్లు అర్జున్‌పై కేసు పెట్టారని, అరెస్ట్ చేశారని, ఆ తర్వాత కోర్టు బెయిల్ (మధ్యంతర) కూడా ఇచ్చిందన్నారు. ఏ నటుడిపై కూడా కాంగ్రెస్ పార్టీకి కోపం లేదన్నారు. తమకు సినిమా వారి పట్ల ప్రేమే ఉందన్నారు. సినిమా తారలపై కేసులు అన్నీ చట్టం పరిధిలోనివే అన్నారు. అల్లు అర్జున్‌పై పెట్టిన కేసును కాంగ్రెస్ పార్టీకి ఆపాదించవద్దని కోరారు. దీనిని అధికార పార్టీకి ఆపాదించే ప్రయత్నం తెలంగాణ బీజేపీ నేతలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

# మీడియాను నేనే లోపలికి తీసుకెళ్లా..

### లోపలికి వెళ్లాక సడెన్ గా వచ్చి దాడి చేశారు

### జర్నలిస్టుపై దాడిపై మంచు మనోజ్ వివరణ



**హైదరాబాద్, డిసెంబర్ 14 (క్విక్ టుడే న్యూస్):** జల్‌పల్లిలోని మంచు మోహన్ బాబు ఫాంహౌస్ లో ఇటీవల మీడియా ప్రతినిధులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. నటుడు మోహన్ బాబు ఓ మీడియా ప్రతినిధి చేతుల్లో నుంచి మైక్ లాక్కుని దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెటిజన్లు దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మీడియా ప్రతినిధులదే తప్పని కొంతమంది కామెంట్లు పెడుతుండగా.. మరికొందరు మోహన్ బాబును తప్పుబడుతున్నారు. తాజాగా ఈ ఘటనపై మంచు మనోజ్ స్పందించారు. ఫాంహౌస్ లోపలికి దూసుకు రావడంతో మీడియా ప్రతినిధులపై దాడి జరిగిందన్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. ఈ ఇష్యూలో మీడియా ప్రతినిధుల తప్పేమీలేదని, తానే వారిని లోపలికి తీసుకెళ్లానని స్పష్టతనిచ్చారు. తన ఏడు నెలల కూతురును తెచ్చుకోవడానికి ఫాంహౌస్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారని చెప్పారు. గేట్లు మూసేసి తనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని వివరించారు. దీంతో తాను గేట్లు పగలకొట్టి మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని లోపలికి వెళ్లానని చెప్పారు. ఇంతలో సడెన్ గా తన తండ్రి, ఇతరులు వచ్చి తమపై దాడి చేశారని చెప్పారు. ఈ క్రమంలోనే ఓ రిపోర్టర్ కు తీవ్ర గాయాలయ్యాయని మనోజ్ వివరించారు.

## మోహన్ బాబు చేసిన
# దాడిని ఖండిస్తున్నాం

### తప్పు చేస్తే శిక్షపడాలి: మంత్రి సీతక్క



**హైదరాబాద్, డిసెంబర్ 14 (క్విక్ టుడే న్యూస్):** జర్నలిస్ట్ రంజిత్‌పై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నామని, తప్పు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే అన్నారు. ఇటీవల మోహన్ బాబు తన ఇంట్లో ఓ జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై మంత్రి స్పందించారు. దాడిలో గాయపడిన జర్నలిస్ట్ వైద్య ఖర్చులను మోహన్ బాబు భరించాలన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమది ప్రజా ప్రభుత్వమని, జర్నలిస్ట్‌లపై దాడులకు చోటు లేదన్నారు. జర్నలిస్ట్‌ల రక్షణకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మోహన్ బాబు కుటుంబంలో వివాదం నేపథ్యంలో ఈ వార్తను కవర్ చేసేందుకు జర్నలిస్టులు జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ రంజిత్ గాయపడ్డారు. దీనికి సంబంధించి మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు కొట్టివేసింది.

# 2029లోనే ఎన్నికలు

### జమిలి అమల్లోకి వచ్చినా మార్పుండదు

### ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి మా మద్దతు

### రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది

### స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### వైసీపీ నేతలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు

### వైసీపీ నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు

### మీడియాతో ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, డిసెంబర్ 14(ఆర్ఎన్ఎ): ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మద్దతు ప్రకటించామని.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 202 9లోనే అని చెప్పారు. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతిచోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికి కనిపిస్తున్నాయి' అని చంద్రబాబు వివరించారు. '2047 లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒక రోజు పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్ తరాల బాగు కోసం చేసే ప్రయత్నంలో అందరు భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయి. ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు, సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం. సమయం సద్వినియోగం, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. ఆస్పత్రిలో చేరిన అద్వానీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. అద్వానీ నాకు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో అద్వానీ సహకారం మరువలేనిది' అని చంద్రబాబు గుర్తుచేశారు. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్-2047 అని చెప్పుకొచ్చారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 1996 నాటి ఏపీ పరిస్థితులు.. 2020 నాటి పరిస్థితులు బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు కనిపిస్తాయన్నారు. 2047లోనూ ఇదే పునరావృతం అవుతుందన్నారు సీఎం చంద్రబాబు.

మరోవైపు సభ్యత్వం నమోదులో టీడీపీ న్యూ రికార్డ్ క్రియేట్ చేసింది. సభ్యత్వ నమోదుపై టీడీపీ ఆఫీసులో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల సంఖ్య ప్రస్తుతం 73 లక్షలకు చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇక సభ్యత్వ నమోదులో టాప్ -5లో రాజంపేట్, నెల్లూరు, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి యువత, మహిళలు సభ్యత్వాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పార్టీలో ఉన్నామంటే కుదరదని, పనితీరు ఆధారంగా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీకి, ప్రజలకు సేవ చేయనివారికి పదవులు కావాలని కోరడం సరికాదన్నారు. పదవులు వచ్చాయని కొందరు పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో కొనసాగుతారని చెప్పకనే చెప్పేశారు సీఎం చంద్రబాబు.

# మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న బాబు

### మోదీ, చంద్రబాబు, జగన్ కలిసి రాష్ట్రానికి అన్యాయం

### విజన్లు కాదు.. విభజన హామీలు కావాలి

### ఆంధ్రప్రదేశ్ దశ - దిశ మారాలంటే తక్షణం మారాలి

### ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల విమర్శలు



అమరావతి, డిసెంబర్ 14 (ఆర్ఎన్ఎ): విజన్ 2047 పేరుతో చంద్రబాబు మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ దశ - దిశ మారాలంటే తక్షణం కావాల్సింది విజన్లు కాదు.. విభజన హామీలు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని నెంబర్ 1గా నిలపాలంటే నెరవేరాల్సింది కేంద్రం ఇచ్చిన హామీలని స్పష్టం చేశారు. దశాబ్ద కాలంగా విభజన హామీలను గాలికి వదిలేశారు.. పూర్తిగా అటకెక్కించారని ఫైర్ అయ్యారు'రాష్ట్ర విభజన సమయంలో అనాడు యూపీఏ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చింది. నూతన రాజధానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం ఇవ్వాలని సూచించింది. బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటన చేసింది. మౌలిక సదుపాయాల కల్పన, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ 13 లో పొందపరిచింది' అని షర్మిల వివరించారు. 'కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చట్టంలో పొందపరిచింది. నూతన రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, హైదరాబాద్ నుంచి విజయవాడకు ర్యాపిడ్ రైల్, ఇలా ఎన్నో హామీలు నేటికీ కలగానే మిగిలాయి. ఇవ్వాల్టికి ఒక్క హామీకి దిక్కులేకుండా పోయింది' అని షర్మిల ట్వీట్ చేశారు. 'గడిచిన 10 ఏళ్లలో ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవి. వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవి. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది వుంటే పేదరిక నిర్మూలన సాధ్యం అయ్యేది. విభజన హామీలు అమలయ్యి ఉంటే రాష్ట్రం దిశ - దశ పూర్తిగా మారేది. దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లేది' అని షర్మిల వ్యాఖ్యానించారు. విభజన చట్ట హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని నరేంద్ర మోదీ అయితే, రెండో ముద్దాయి చంద్రబాబు, మూడో ముద్దాయి జగన్ మోహన్ రెడ్డి. ఈ ముగ్గురు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. హోదా 5 ఏళ్లు కాదు 10 ఏళ్లు ఇస్తామని మోదీ నమ్మబలికితే.. హోదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు చెవుల్లో పూలు పెట్టారు' అని సెటైర్లు వేశారు. '25 మంది ఎంపీలు ఇస్తే ఎందుకు ఇవ్వరో చూస్తా అని శపథాలు చేసిన జగన్.. రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేశారు. చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఎప్పటికైనా రాష్ట్ర అభివృద్ధికి సంజీవని ప్రత్యేక హోదా మాత్రమే. హోదాతోనే రాష్ట్రానికి విజన్. మోదీ పిలక మీ చేతుల్లో ఉంది. విభజన హామీలపై ప్రధానిని నిలదీయండి. కేంద్రం గల్లా పట్టి రాష్ట్ర హక్కులను సాధించండి' అని షర్మిల డిమాండ్ చేశారు.

# జగన్ ఆస్తుల కేసులో కీలక పరిణామం

### సుప్రీంకోర్టుకు సీబీఐ, ఈడీ నివేదిక

### అక్రమాస్తుల కేసు బదిలీ, బెయిల్ రద్దుపై విచారణ

### జనవరి 10కి తదుపరి విచారణ వాయిదా



మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయన కేసులకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సుప్రీం కోర్టుకు సీబీఐ, ఈడీ అందజేశాయి. ఆ నివేదికను పరిశీలించిన తరువాతే తీర్పు ఇస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల బదిలీ, బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జనవరి 10 వాయిదా పడింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసుల విచారణలో జాప్యంపై అఫిడవిట్ రూపంలో నివేదికను సీబీఐ, ఈడీ దాఖలు చేశాయి. కేసుల జాప్యానికి గల కారణాలను అఫిడవిట్‌లో దర్యాప్తు సంస్థలు వివరించాయి. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ ఆలస్యం అవుతోందని%ా% వేగవంతంగా ట్రయల్ పూర్తి చేసేందుకు తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని.. లేకపోతే కేసుల విచారణపై తీవ్ర ప్రభావం పడుతుందని మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ కూడిన ధర్మాసనం విచారించింది. సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ) రాజ్‌కుమార్ భాస్కర్ ఠాక్రే వాదనలు వినిపిస్తూ సీబీఐ, ఈడీ కేసుల స్టేటస్ వివరాలు గురువారం సాయంత్రం ఫైల్ చేసినట్లు ధర్మాసనానికి తెలిపారు. దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన స్టేటస్ రిపోర్ట్ కాపీ తాము పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. తాము కూడా పరిశీలించడానికి కొంత సమయం కావాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోరారు. వైఎస్ జగన్ కేసుల విచారణలో ఎందుకు జాప్యం జరుగుతుందని గతంలో దర్యాప్తు సంస్థలను సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కేసుల స్టేటస్‌ను వివరిస్తూ నివేదిక ఇవ్వాలని ఈనెల 2 (సోమవారం)న విచారణ సందర్భంగా దర్యాప్తు సంస్థలను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలతో జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ, ఈడీ కేసుల పురోగతిని, ప్రస్తుత పరిస్థితి, గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ఆ తరువాత పరిణామాలతో అఫిడవిట్ రూపంలో స్టేటస్ రిపోర్టును దర్యాప్తు సంస్థలు దాఖలు చేశాయి. సిబిఐ, ఈడీ ఇచ్చిన నివేదికలను పరిశీలించిన తీర్పు ఇస్తామని తరువాత జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం స్పష్టం చేసింది. జగన్ అక్రమాస్తులు వ్యవహారంలో మొత్తం 125 పిటిషన్లపై విచారణ పెండింగ్‌లో ఉన్నాయి. ట్రైల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు దాఖలైన పిటిషన్లలో దాదాపు 80 శాతం పిటిషన్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ విషయం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ముందు దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన అఫిడవిట్‌లో వెల్లడి అయ్యాయి. శుక్రవారం జరిగిన విచారణలో రఘురామ కృష్ణరాజు తరపున న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ హాజరయ్యారు.

# తిరుమలలో భక్తుల రద్దీ

### ఒక్క రోజే స్వామివారిని దర్శించిన 63,722మంది భక్తులు

తిరుమల, డిసెంబర్ 14 (ఆర్ఎన్ఎ): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు 7 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 9 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న 63,722 స్వామివారిని దర్శించుకోగా 22,225 తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.77 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. టీటీడీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం డిసెంబరు 28న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు ఈవో శ్యామల రావు తెలిపారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని, భక్తులు 0877-2263261 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష లేదు

### వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు : కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 14:** మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష ప్రదర్శించడం లేదని, వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్, ఇండోనేషియా లాంటి దేశాల్లో ఉన్న ముస్లింలతో పోలిస్తే, భారత్‌లో ముస్లింలు బెటర్‌గా ఉన్నట్లు చెప్పారు. అందుకే పొరుగు దేశాల్లో ఉంటున్న ముస్లింలు కూడా ఆశ్రయం కోరుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. ఇతర దేశాల్లో మైనార్టీలకు కల్పిస్తున్న ఓటింగ్ హక్కుల గురించి కూడా మంత్రి రిజిజు తెలిపారు. దేశం గురించి మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత ఇమేజ్‌పై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తమ హక్కులను కాపాడుకునేందుకు మైనార్టీలకు న్యాయరక్షణ కల్పిస్తోందని మంత్రి రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్య రంగంలో భారత్‌తో ఏ దేశాన్ని కూడా పోల్చలేమన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో చాలా గ్యాప్‌లు ఉన్నాయని, అందుకే ప్రధాని మోదీ వికసిత్ భారత్ నినాదాన్ని ఇచ్చినట్లు వెల్లడించారు.



# ఖైదీ నెంబర్ 7697

## జైలులో బన్నీ ఏం చేశాడంటే..?

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తికాకపోవడంతో నైట్ అంతా జైలులోనే గడిపాడు అల్లు అర్జున్. అయితే జైలులో ఉన్న అల్లు అర్జున్‌కి అధికారులు ఎలాంటి వసతి కల్పించారు. బన్నీ ఎలా ఉన్నాడు అనే దానిపై ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. అల్లు అర్జున్‌ని చంచల్‌గుడాలోని వీఐపీ బ్లాక్ ఉంచినట్లు తెలుస్తుంది. ఇక జైలులో ఉన్న అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీగా యూటీ 7697 నంబర్‌ను అధికారులు కేటాయించారు. రాత్రంతా మంజీరా బ్యారక్‌లోని బ్లాక్ -1లో అల్లు అర్జున్‌ని ఉంచగా.. తెల్లవారేవరకు అల్లు అర్జున్ నిద్రపోకుండానే గడిపినట్లు తెలుస్తుంది. అల్లు అర్జున్ పడుకునే ముందు జైలు సిబ్బంది రగ్గు దుప్పటి ఇచ్చినట్లు సమాచారం. అయితే వీటిని తిరస్కరించి అల్లు అర్జున్ నేలపైనే పడుకున్నట్లు.. ఇక జైలులో ఉన్నంత సేపు అధికారులతో తప్ప ఎవరితో బన్నీ మాట్లాడలేదని తెలుస్తుంది. రాత్రి జైలులో అధికారులు భోజనం అందించగా.. కొంచెం తిని పక్కన పెట్టినట్లు తెలుస్తుంది. ఉదయం 5.45 గంటలకు బన్నీని జైలు నుంచి బయటకు తీసుకువచ్చి.. విడుదలకు సంబంధించిన ఫార్మాలిటీస్ పూర్తిచేసినట్లు.. ఉదయం 6.39 గంటలకు విడుదల చేసినట్లు సమాచారం.

### ఆ కుటుంబానికి ఆమె లోటు

# ఎవరూ పూడ్చలేనిది

**బాధిత కుటుంబానికి అండగా ఉంటా**

**జైలు నుంచి విడుదల అనంతరం మీడియాతో అల్లుఅర్జున్**



సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో శనివారం ఉదయం జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చారు. అయితే ఉదయమే మీడియాతో మాట్లాడిన అల్లు అర్జున్ తాజాగా మరోసారి మీడియా ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా తనకు  అండగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరం. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. ఆ కుటుంబానికి మరోసారి నా క్షమాపణలతో పాటు సానుభూతి తెలుపుతున్నా. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటాను. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఈ ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. గత 20 ఏళ్లుగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నా.. కానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. నాకు అండగా నిలిచిన అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు అంటూ అల్లు అర్జున్ చెప్పుకోచ్చాడు.

### అల్లు అర్జున్‌తో పెట్టుకుంటే

# సర్వనాశనం అవుతారు

**ప్రముఖ రచయిన చిన్నికృష్ణ సంచలన కామెంట్**



సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టైన టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ చంచల్‌గూడ జైలు నుంచి శనివారం ఉదయం 6.40 గంటలకు విడుదలయిన విషయం తెలిసిందే. జైలు నుంచి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బన్నిని పరామర్శించేందుకు సినీ సెలబ్రిటీలు అల్లు నివాసానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్న టాలీవుడ్ రచయిత చిన్ని కృష్ణ బన్నీ అరెస్ట్‌పై సంచలన వ్యాఖ్యలు చేశాడు. అల్లు అర్జున్‌కు మరక అంటించాలని చూసిన ఏ నాయకుడు అయినా, ఏ ప్రభుత్వం అయినా సర్వనాశనం అయిపోతారని చిన్ని కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశాడు.



# అల్లు అర్జున్‌ను చూసి చిరంజీవి భార్య ఎమోషనల్

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టైన టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ చంచల్‌గూడ జైలు నుంచి శనివారం ఉదయం 6.40 గంటలకు విడుదలయిన విషయం తెలిసిందే. జైలు నుంచి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బన్నిని పరామర్శించేందుకు సినీ సెలబ్రిటీలు అల్లు నివాసానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్కడకి చేరుకున్న అల్లు అర్జున్ మేనత్త, చిరంజీవి భార్య సురేఖ అల్లు అర్జున్‌ను చూసి భావోద్వేగానికి గురైంది. అల్లు అర్జున్ కూడా మేనత్తని చూసి దగ్గరికి వెళ్లి హాగ్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# నువ్వు నాలో స్ఫూర్తిని నింపావు

రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.





# ఇది ముమ్మాటికీ రాజకీయమే : పూనమ్ కపూర్

చిక్కడ పల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం.. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడం.. హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడం.. రాత్రంతా బన్నీ జైల్లోనే ఉండటం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయమే బన్నీని జైలు నుంచి విడుదల చేశారు. ఇక సెలెబ్రిటీలు అయితే బన్నీకి అండగా నిలిచారు. టాలీవుడ్ మొత్తం కదిలివచ్చింది. అల్లు అర్జున్ కోసం బాలీవుడ్ స్టార్లు కూడా మాట్లాడి మద్దతు తెలిపారు. ఇక సోషల్ మీడియాలో బన్నీ అరెస్ట్ మీద భిన్న వాదనలు అయితే వినిపించాయి. స్టార్ అయితే ఏంటి? నేషనల్ అవార్డు విన్నర్ అయితే ఏంటి? చట్టం ముందు అందరూ సమానులే.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది అని కొందరు అన్నారు. ఇక రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు చర్యలు అంటూ ప్రతి పక్షాలు మండిపడ్డాయి. ఈ హడావిడిలో పూనమ్ కౌర్ కూడా కొన్ని సెటైర్లు వేసింది. అల్లు అర్జున్ ఫోటోలను షేర్ చేస్తూ.. నా ఫేవరేట్ హీరో అని చెప్పింది. ఇక తాజాగా మరో ట్వీట్ వేసింది. ఇందులో అధికారాన్ని దుర్వినియోగం చేయడమే రాజకీయం.. ఆ అధికారాన్ని ప్రజల అభివృద్ధికి వాడటమే నాయకత్వం అంటూ కౌంటర్ వేసింది. అంటే రేవంత్ రెడ్డి తన పవర్‌ను మిస్ యూజ్ చేస్తున్నాడని, రాజకీయాలు చేస్తున్నాడని పూనమ్ కౌర్ చెప్పకనే చెబుతూ కౌంటర్లు వేసింది. అల్లు అర్జున్ మాత్రం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఈ కేసు ఉందని, భారత న్యాయ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ కేసు గురించి తాను బయట మాట్లాడను అని చెప్పేసి వెళ్లిపోయాడు.


**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District,  Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com